క్లుప్తంగా

పూర్వ ప్రాథమిక విద్య పూర్తి


చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించిన ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది

గోస్పాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకొని ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్లు పొందుతున్నారని సీడీపీఓ పద్మావతి తెలిపారు. మండలంలోని జూలేపల్లె గ్రామంలో సూపర్‌వైజర్ కుమారి ఆధ్వర్యంలో చిన్నారులను పాఠశాలలో చేర్పించారు. గ్రామంలోని 12 మంది చిన్నారులు పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకోగా వారికి స్థానిక ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు.

మాన్యం కౌలుకు వేలం


వేలంలో పాల్గొన్న అధికారులు, రైతులు

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామంలోని శ్రీ గౌరీభోగేశ్వరస్వామి ఆలయానికి చెందిన 46 ఎకరాలు, శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయానికి సంబంధించిన 44.14 ఎకరాల మాన్యం భూముల కౌలు వేలం పాటను శనివారం నిర్వహించారు. ఈఓ చంద్రుడు మాట్లాడుతూ ఈ ఏడాది రూ.20.14 లక్షలకు వేలం జరుగగా.. గతేడాది 16.38 లక్షలకు పలికిందన్నారు. గతేడాది కంటే ఈసారి రూ.3.76 లక్షల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. ఆలయ మాజీ ధర్మకర్తలు నారాయణ స్వామి, లింగుట్ల వెంకటనాయుడు, గోపాల్ నాయుడు పాల్గొన్నారు.

మెనూ పాటించాలి


నగళ్లపాడు ప్రాథమిక పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ న్యామతుల్లా

చాగలమర్రి: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈఓ -2 న్యామతుల్లా హెచ్‌ఎంలు, ఏజెన్సీ సభ్యులకు సూచించారు. శనివారం మండలంలోని మద్దూరు, నగళ్లపాడు గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే వంటశాలలో కూడా ఈగలు, దోమలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హెచ్‌ఎంలు నరసింహారెడ్డి, లలిత కుమారి ఉన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం


మొక్క నాటుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల(సిటీ): మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని న్యాయశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ఈద్గా వద్ద మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ పరిసరాల్లో మొక్కలు పెంచి కాలుష్య నియంత్రణకు కృషి చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి ఉన్నారు.

జగ్జీవన్‌రామ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు బాబూ జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని బాల చంద్ర సమతా విద్యానికేతన్ కరస్పాండెంట్ బాలచంద్రుడు అన్నారు. శనివారం పాఠశాలలో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ముందస్తుగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

చాగలమర్రి: మండలంలోని గొడిగనూరు గ్రామానికి చెందిన పూజనబోయిన గంగన్నపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దాడి చేసి గాయపరచిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగన్న మోటార్ మెకానిక్ పని కోసం శెట్టివీడు గ్రామానికి వెళ్లి తిరిగొస్తుండగా.. మార్గమధ్యలో జింకల మహేంద్ర, జింకల నాగేంద్ర మోటారు సైకిల్‌పై చాగలమర్రికి వస్తుండగా అదుపు తప్పి గంగన్న బైక్‌ను ప్రమాదవశాత్తు ఢీ కొట్టడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో మహేంద్ర, నాగేంద్ర..గంగన్నపై దాడి చేసి గాయపరిచారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రమణయ్య ఘటనా స్థలికి చేరుకొని గంగన్నను చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.


నంద్యాల చిన్నచెరువు

జనహితం కోసం తవ్వించిన చెరువులు నేడు కబ్జా కోరల్లో చిక్కుకుని సన్నబడుతున్నాయి. తాగు, సాగునీటి అవసరాల కోసం గతంలో చెరువులు తవ్వించారు. అయితే కొందరు అక్రమార్కులు వాటిని సైతం ఆక్రమించి పంటలు సాగు చేసుకుంటున్నారు. అన్నీ తెలిసిన అధికారులు మిన్నకుండిపోవడం కబ్జారాయుళ్లకు కలిసివచ్చినట్లయ్యింది. మరింత ఆక్రమిస్తూ ముందుకు సాగుతున్నారు. దీంతో ఏటేటా చెరువుల విస్తీర్ణం తగ్గిపోతుండటంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారిని ఆదర్శంగా తీసుకున్న మరికొందరు వాగులు, వంకలను చెరపడుతుండటంతో అవి ఆనవాళ్లను కోల్పోతున్నాయి.


చెరువులో పంటలు సాగు చేసిన దృశ్యం

కబ్జా కోరల్లో చెరువులు

- వాగులు, వంకలనూ వదలని అక్రమార్కులు
- అధికారులకు తెలిసినా చర్యలు శూన్యం
- ఆందోళనలో అన్నదాతలు
- కాపాడాలంటూ వినతులు

నంద్యాల(అర్బన్): ఏటేటా వర్షం రాక మందగించడంతో అక్రమార్కుల కన్ను చెరువులపై పడింది. అనుకున్నదే తడవుగా.. ఆక్రమించి పంటల సాగుకు పూనుకున్నారు. మరికొందరు వాటిని బిట్లుగా మార్చి రైతుకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఆయకట్టు రైతుల పొలాలకు రెండు పంటలకు సాగు నీరు అందేలా 426 ఎకరాల్లో నంద్యాల చిన్నచెరువు, కానాల నాగమ్మ చెరువును నిర్మించారు. ఖరీఫ్ ఆరంభం నుంచే నంద్యాల చిన్నచెరువు, కానాల నాగమ్మ చెరువులు కేసీ కెనాల్ నీటితో నిండుతాయి. రెండు దశాబ్దాలుగా వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో చెరువుల్లోని ఎత్తు పల్లాలను కొందరు ఆక్రమించుకొని పంట పొలాలుగా మార్చుకుంటూ వచ్చారు. గతంలో రెండు కార్ల పంటలు పండేవని, ప్రస్తుతం ఒక పంటకు కూడా సాగునీరు అందే పరిస్థితులు కనిపించడం లేదని అయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల ఆక్రమణలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన కరువవుతోంది. చెరువుల విస్తీర్ణం రోజురోజుకు కుచించుకు పోతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

నంద్యాల చిన్న చెరువు..

నంద్యాల నుంచి మహానంది వైపు వెళ్లే రహదారిలో 456 ఎకరాల విస్తీర్ణంలో నంద్యాల చిన్నచెరువు ఏర్పాటైంది. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన చెరువును కేసీ కెనాల్ నీటితో నింపుతున్నారు. కెనాల్ నుంచి వచ్చే మట్టి, ఇసుక కెనాల్ సమీపంలో మేటలు వేయడంతో ఎత్తు పల్లాలుగా మారింది. ఇదే అదునుగా ఐదు దశాబ్దాల క్రితం కొంత మంది పేదలు ఎకరా, అర ఎకర సాగు చేసుకుంటూ వచ్చారు. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న పేద కూలీలకు అప్పట్లో జిల్లా కలెక్టర్లు ఏక్‌సాల్ పట్టాలు మంజూరు చేశారు. ఇదే క్రమంలో కోస్తా ప్రాంతానికి చెందిన ఓ రైతు తనకున్న కొద్దిపాటి పొలాన్ని సాగు చేసుకుంటూ పేదల పొలాలను సైతం కొనుగోలు చేసి మిట్ట ప్రాంతంలో ఉన్న పొలాలన్నింటినీ సొంతం చేసుకున్నారు. వాటికి భూ పట్టాలు, పాసు పుస్తకాలను పొందినట్లు సమాచారం. దాదాపు 180 ఎకరాలు ఆక్రమణకు గురి కావడంతో చివరి ఆయకట్టు భూములకు నీరు అందకపోవడంతో పంట దిగుబడులు సాధించలేని పరిస్థితి నెలకొంది. పేదలకు ఇచ్చిన పట్టా భూములను తిరిగి వారికే ఇవ్వాలంటూ కోస్తా ప్రాంత రైతుపై పలుమార్లు ప్రజాసంఘాలు, వామపక్ష పార్టీల నాయకులు ఆందోళనలు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో చిన్నచెరువు ఆక్రమణలతో ఏటేటా సన్నబడుతోంది.


ఆక్రమణకు గురైన కానాల చెరువు

380 ఎకరాల ఆక్రమణల్లో నాగమ్మ చెరువు..

నంద్యాల మండలంలోని కానాల నాగమ్మ చెరువును పలు గ్రామాల రైతులు ఆక్రమించుకున్నారు. ఎత్తు పల్లాలు ఉన్న ప్రాంతాల్లో పంటలు సాగు చేస్తూ క్రమేణా పొలాలకు అవసరమైన డీపట్టాలు పొందారు. 856 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కానాల నాగమ్మ చెరువులో దాదాపు 380 ఎకరాలను కానాల, చాబోలు, సాంబవరం, బాబానగర్ తదితర గ్రామాల రైతులు ఆక్రమించుకున్నారు. ఫలితంగా ఆయకట్టు చివరి భూములకు నీరందక ఆరుతడి పంటలు సాగు చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో రెండుకార్ల వరి పంట పండించిన రైతులు.. నేడు మెట్ట పంటలకు పరిమితమవుతున్నారు. ఆక్రమణదారుల నుంచి చెరువులను రక్షించాలని పలుమార్లు ఆయకట్టు రైతులు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయింది.

వాగులనూ వదలని అక్రమార్కులు..

చెరువులను కబ్జా చేసిన వారి కన్ను పట్టణ సమీపంలోని పాలేరు, సంకలవాగు, కప్పలవాగు, మద్దిలేరు తదితర వంకలు, వాగులపై పడింది. దీంతో అవి కూడా వారి కబంధ హస్తాల్లో చిక్కుకుని కుచించుకుపోయాయి. ఇప్పటికైనా చెరువులు, కుంటల పట్ల రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించకపోతే వీటి మనుగడతో పాటు వీటిపై ఆధారపడ్డ రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

180 ఎకరాలు ఆక్రమించారు



నంద్యాల చిన్న చెరువులో 180 ఎకరాలు ఆక్రమణదారుల చేతుల్లో ఉన్నాయి. గతంలో 426 ఎకరాల విస్తీర్ణంలో చెరువు కళకళలాడుతూ ఉండేది. బడా బాబులు కొందరు మిట్ట భూములను ఆక్రమించుకోవడంతో చెరువు కుచించుకు పోయింది. ఆక్రమణలు రోజురోజుకు పెరిగిపోతుండటంతో సాగునీటికి ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నచెరువు ఆక్రమణలపై గ్రామస్తులు పలుమార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. జిల్లా అధికారులు స్పందించి చెరువును ఆక్రమణదారుల నుంచి కాపాడాలి.

–జయన్న, బిల్లలాపురం, నంద్యాల

నాగమ్మ చెరువు రైతులను ఆదుకోవాలి



నా చిన్నతనంలో నాగమ్మ చెరువు కింద రైతులు రెండు పంటలు పండించే వారు. చెరువు భూములు ఆక్రమణలకు గురవుతుండటంతో విస్తీర్ణం తగ్గిపోయింది. నీటి నిల్వలు తగ్గడంతో రైతులు ఒకే పంటతో సరిపెట్టుకుంటున్నా. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో సైతం ఆయకట్టు రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. అధికారులు స్పందించకపోతే చెరువు మొత్తం ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది. – కాశీం, కానాల, నంద్యాల

ఫిర్యాదు చేస్తే చర్యలు



చెరువు భూములు ఆక్రమణలకు గురైనట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం. భూముల ఆక్రమణలు చట్టరీత్యా నేరం. ఏక్‌సాల్ పట్టాలు, డీపట్టాలు తాత్కాలికమే. కొంత కాలం వరకే అవి పనిచేస్తాయి. భూములు ఆక్రమించుకున్నట్లు తేలితే స్వాధీనం చేసుకుంటాం. భూముల ఆక్రమణలను ఎవరు ప్రోత్సహించినా శిక్షార్హులే.

– చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్, నంద్యాల

గాలివీచిందా.. కరెంట్ కట్

- విద్యుత్ సమస్యతో అల్లాడుతున్న క్రిష్టిపాడు గ్రామస్తులు
- రెండు నెలలుగా తీవ్రమైన సమస్య
- పట్టించుకోని అధికారులు


క్రిష్టిపాడు ఎస్సీ కాలనీలో అస్తవ్యస్తంగా విద్యుత్ తీగలు

దొర్నిపాడు: చిన్నపాటి గాలి వీచిందా.. గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. అలాగే చినుకులు రాలినా, ఉరుములు, మెరుపులు వచ్చినా కరెంట్ కట్.. ఇలా రెండు నెలలుగా మండలంలోని క్రిష్టిపాడు గ్రామస్తులు విద్యుత్ సమస్యతో అల్లాడిపోతున్నారు. గ్రామానికి కోవెలకుంట్ల మండలం గుళ్లదూర్తి సబ్‌స్టేషన్ నుంచి ఉయ్యాలవాడ మండలం హరివారం గ్రామం మీదుగా విద్యుత్ సరఫరా అవుతుంది. ఆరు కిలోమీటర్ల దూరంలోనున్న సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేసే తీగలు అస్తవ్యస్తంగా ఉండటంతో గాలివీచిందంటే తీగలు రాసుకొని విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. దీంతో గ్రామస్తులు సబ్‌స్టేషన్‌కు ఫోన్‌చేసి సరఫరా లేదు సార్.. అని విన్నవిస్తే.. మాకు ఉందే.. మీ వద్దే ఏదో సమస్య ఉంది చూసుకోండి అంటూ ఉచిత సలహాలు ఇవ్వడం పరిపాటిగా మారింది. గాలి వీయని సమయంలో విద్యుత్ తీగలు అర్త్ కావడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజులు ఎగిరిపోవడం నిత్యకృత్యంగా మారింది. అలాగే.. నిత్యం ఏదో ఒక సమస్య పేరుతో స్థానిక ప్రైవేట్ హెల్పర్లు, ఎలక్రీషియన్లు ఎల్‌సీ తీసుకొని విద్యుత్ పనులు చేస్తుండటంతో గ్రామంలో విద్యుత్ సరఫరా ఉండటమే గగనంగా మారడంతో విద్యుత్ పనులు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇక స్థానిక హెల్పర్లు విద్యుత్ పనుల పేరుతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజులు తొలగించి పనులు పూర్తయినా పునరుద్ధరించకపోవడంతో చీకట్లో మగ్గాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇక ఫీజు వేయడానికి హెల్పర్లు గృహ వినియోగదారుల నుంచి డబ్బులు గుంజుతున్నారు. రోజూ సబ్ స్టేషన్‌కు ఫోన్ చేస్తున్నా సమస్య ఏంటని విద్యుత్‌శాఖ అధికారులు విచారించకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. బిల్లుల సమయంలో మాత్రం కచ్చితంగా చెల్లించాలని చెప్పడానికి వచ్చే వారు సమస్యల పరిష్కారాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా తాత్కాలిక మరమ్మతులు చేసి వెళ్తున్నారే కానీ శాశ్వత పరిష్కారం చూపడం లేదని చెబుతున్నారు.

పాఠశాలల్లో 390 మంది విద్యార్థుల చేరిక


ఉయ్యాలవాడ మోడల్‌స్కూల్‌లో అడ్మిషన్లు పూర్తి చేస్తున్న ఉపాధ్యాయులు

ఉయ్యాలవాడ : మండలంలోని వివిధ పాఠశాలల్లో 1– 10వ తరగతి వరకు పాఠశాలలు పునః ప్రారంభమైనప్పటి నుంచి 390 మంది విద్యార్థులు చేరినట్లు ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1వ తరగతిలో అంగన్‌వాడీ కేంద్రాల నుంచి 140 మంది విద్యార్థులు చేరారని, అలాగే 6వ తరగతిలో 250 మంది విద్యార్థులు ఉయ్యాలవాడ, హరివరం, కొండుపల్లె, మాయలూరు, బోడెమ్మనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు ఉయ్యాలవాడ మోడల్‌స్కూల్‌లో చేరినట్లు వెల్లడించారు. ప్రతి విద్యార్థికి ప్రభుత్వం మంజూరు చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, బెల్ట్‌లు, డిక్షనరీలు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా పంపిణీ చేసినట్లు వివరించారు. స్కూల్ యూనిఫాంలు ఇంకా సరఫరా కావాల్సి ఉందన్నారు.

ఎరువులు, మందుల అమ్మకాలు నిలిపివేత


గోస్పాడులోని మందుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

గోస్పాడు: మండల కేంద్రంలోని ఎరువుల, మందు దుకాణాల్లో సరైన ధ్రువపత్రాలు లేని రూ.9.47 లక్షల ఎరువుల అమ్మకాలను అధికారులు నిలిపివేశారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక బృందాలు, కర్నూలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సిద్ధయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఏఓ స్వప్నికారెడ్డి ఆధ్వర్యంలో వెంకటసాయి, న్యూ శ్రీకర ఫర్టిలైజర్స్ షాపుల్లో తనిఖీలు చేసి రికార్డులు, స్టాక్ నిల్వలు, అనుమతులను పరిశీలించారు. బయో ఉత్పత్తులకు సంబంధించిన ధ్రువ పత్రాలు సక్రమంగా లేనట్లు గుర్తించారు. వెంకటసాయి ఫర్టిలైజర్స్ షాపులో రూ.9.27 లక్షలు, న్యూశ్రీకర ఫర్టిలైజర్ షాపులో రూ.19,880 విలువజేసే ఎరువులు, మందుల అమ్మకాలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. నంద్యాల వ్యవసాయాధికారి ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధి ప్రమాదకరం


చాగలమర్రిలో పెంపుడు కుక్కకు రేబిస్ టీకా వేస్తున్న ఏడీఏ వరప్రసాద్


పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న డాక్టర్ ధనుంజయుడు

దొర్నిపాడు: కుక్కకాటు వల్ల వచ్చే రేబిస్ వ్యాధి ప్రమాదకరం అని స్థానిక పశువైద్యాధికారి ధనుంజయుడు అన్నారు. శనివారం జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు స్థానిక పశువైద్యశాలలో యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధులను జూనోసిస్ వ్యాధులుగా పేర్కొంటారన్నారు. పందుల నుంచి మెదడువాపు, గొర్రెలు, మేకల నుంచి అంత్రాక్స్, ఆవులు, గేదెల వల్ల క్షయ, వాటి పాల ద్వారా బ్రూసెల్లోసిస్, పక్షులతో సిటాకోసిస్, ఎలుకలతో ప్లేగు, కోళ్లతో బర్డ్‌ఫ్లూ వస్తుందన్నారు.

చాగలమర్రి: జంతువులు, పశుపక్ష్యాదులతో మనుషులకు సంక్రమించే జూనోసిస్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ప్రాంతీయ పశు వైద్యశాల ఏడీఏ వరప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటి రేబిస్ టీకాలు వేశారు. అనంతరం స్థానిక జెడ్పీ బాలుర, బాలికల ఉన్నతపాఠశాల, ముత్యాలపాడులోని ఎస్‌పీజీ ఉన్నత పాఠశాలలో జూనోసిస్ వ్యాధులపై విద్యార్థులకు పశువైద్యాధికారి సాయిబాబా ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ, వైస్ ప్రిన్సిపాల్ శైలజ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవంపై సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ జంతువుల నుంచి వ్యాప్తించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

చిన్నారిని చితకబాదిన టీచర్

నంద్యాల(అర్బన్): మాట వినలేదని ప్రభుత్వ ఉపాధ్యాయురాలు 3వ తరగతి చిన్నారిని చితకబాదిన ఘటన నంద్యాల మండలం చాపిరేవుల గ్రామ ప్రాథమిక పాఠశాలలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. 3వ తరగతి చదువుతున్న మల్లేశ్వరి యథావిధిగా పాఠశాలకు రాగా టీచర్ ప్రమీల హోంవర్క్ చేయకుండా మూడు రోజుల పాటు ఏం చేస్తున్నావంటూ గద్దించింది. భయాందోళనకు గురైన చిన్నారి తరగతి గదిలోని బల్ల కిందకు వెళ్లి దాక్కుంది. దీంతో టీచర్ ఈత బెత్తంతో కాళ్లు, చేతులు, ఇతర భాగాల్లో వాతలు పడేలా కొట్టడంతో భరించలేక చిన్నారి భయంతో కేకలు వేసుకుంటూ బయటకు పరుగుతీసింది. ఇరుగు పొరుగు వారు విషయాన్ని మల్లేశ్వరి తల్లిదండ్రులకు చేరవేశారు. గ్రామస్తులు, విద్యార్థిని కుటుంబ సభ్యులు ఉపాధ్యాయురాలిని నిలదీశారు. టీచర్ మాట్లాడుతూ హోంవర్క్ చేయలేదనే మందలించానని, చిన్నారిపై తనకు ఎలాంటి కోపం లేదన్నారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ బ్రహ్మంనాయక్, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శ్రీనివాసులుతో కలిసి పాఠశాలలో విచారణ చేశారు.

కేంద్ర ప్రభుత్వ తీరు సరికాదు

నంద్యాల(న్యూటౌన్): నీట్‌లో అవినీతి జరగలేదని కేంద్ర ప్రభుత్వం దేని ఆధారంగా చెబుతుందని, పేపర్ లీకేజీ చేశామని నిందితులు అంగీకరిస్తుంటే ఎందుకు నిజాలు దాస్తుందని వెంటనే వైఖరి మార్చుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలని శనివారం పద్మావతినగర్ సెంటర్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పీడీఎస్‌యూ నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పవన్, రాంబాబు మాట్లాడుతూ నీట్ – 2024, ఎన్‌టీఏను తక్షణమే రద్దు చేయాలన్నారు.

మహిళపై దాడి

రుద్రవరం: మండలంలోని ఆలమూరు గ్రామంలో మహిళపై దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఏఎస్‌ఐ బాలన్న వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బయమ్మ అనే మహిళ ఇంటి దగ్గర కోడిపిల్లలను కుక్క చంపివేయడంతో కుక్కను తిడుతుండగా..తమనే తిడుతుందని భావించిన బాషా, రఫీ, రహీం, బావయ్య దామె దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ చెప్పారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రంలో 1.50 కోట్ల మంది వ్యవసాయ కూలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం బాలయ్య అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 20 కోట్ల మంది వ్యవసాయ కూలీలు కష్టంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కేరళ రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగులకు ఉన్న చట్టాలలాగా వ్యవసాయ కూలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి హక్కులను కల్పించిందన్నారు. ఈనెల 10వ తేదీన విజయవాడలో జరిగే సమావేశానికి ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు, నరసింహనాయక్, డేవిడ్, పక్కీర్‌సాహెబ్ పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు


స్వామి వారి దర్శనానికి ఆలయం వెలుపల క్యూలో వేచి ఉన్న భక్తులు


ఆర్.జంబులదిన్నెలో ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

రుద్రవరం: మండలంలోని వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మధుసూధన్ రెడ్డి,రంగనాయకుల ఆధ్వర్యంలో అర్చకులు ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు గావించి ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తాదులు గంటల తరబడి క్యూలైన్లో వేచి ఉండి స్వామి అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు..

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు, సుద్దమల్ల గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ అభయాంజనేయస్వామి, లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, లక్ష్మీనరసింహ కంబగిరి స్వామికి అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు లక్ష్మణ స్వామి, భాస్కరశర్మ, అనంతయ్య, కమలేష్‌శర్మలు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

లోకకల్యాణార్థం శ్రీసుదర్శన, నృసింహ యాగం


సుదర్శన, నృసింహ యాగాల్లో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక స్టేట్‌బ్యాంక్ కాలనీలో వెలసిన శ్రీత్యాగరాజస్వామి దేవస్థానంలో లోక కల్యాణార్థం శనివారం శ్రీమహాసుదర్శన, నృసింహ యజ్ఞం ఆలయ నిర్వాహకులు ఊడుమాల్పురం మల్లుగాళ్ల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశ స్థాపన, ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించి అంకురార్పణ, రక్షాబంధనం, అగ్నిప్రతిష్టాపన జరిపించి మహాపూర్ణాహుతి గావించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసి అన్నదానం చేశారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా హైదరాబాద్ ఓల్డ్ సిటీ భద్రకాళీ పీఠం మాతాజీ డాక్టర్ సింధు పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. శీనయ్య, సుమశ్రీ రవి, పుల్లయ్య, నాగమణి పాల్గొన్నారు.

వారాహి దేవి నవరాత్రులు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో వారాహి అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని పార్కురోడ్డులో వెలసిన శ్రీ నిమిషాంబదేవి ఆలయంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని పట్టణ చిత్తారి సంఘం ఆధ్వర్యంలో వారాహి దేవి నవరాత్రులను శనివారం ప్రారంభించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. ఉత్సవ మూర్తికి కలశ పూజ,మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి: వర్షాకాలంలో వచ్చే డెంగీ, డయేరియా, మలేరియా, చికెన్‌గున్యా తదితర వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముత్యాలపాడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి తస్లిమా సుల్తానా తెలిపారు. శనివారం మండలంలోని గ్రామ ఆరోగ్య కేంద్రంలో వ్యాధుల ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. పరిసరాల, వ్యక్తిగత శుభ్రతతో సగం వ్యాధులను దూరం చేయవచ్చని చెప్పారు. దోమల నివారణ చర్యలు చేపట్టాలని, రాత్రిపూట దోమతెరలు వినియోగించాలని సూచించారు. ఆరోగ్య విస్తరణ అధికారి జి.వేంకటేశ్వర్లు, కేవీ సుబ్బరాయుడు, సీహెచ్‌ఓ కృష్ణమ్మ, ఏఎన్‌ఎం సంధ్య పాల్గొన్నారు.